సింగరేణి పాఠశాలలో 'సీబీఎస్ఈ'

- రెండేళ్ల పాటు కొత్త సిలబస్‌లో 1 నుంచి 8 తరగతుల్లో అమలు
- ఆర్జీ–2 సెక్టార్–3 పాఠశాల ఎంపిక
- ఏర్పాట్లు చేస్తున్న యాజమాన్యం



సెక్టార్–3 సింగరేణి పాఠశాల



సూచనలు చేస్తున్న ఎడ్యుకేషన్ జీఎం నికోలస్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొత్తం తొమ్మిది పాఠశాలల్లో తొలిసారి సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధనను ప్రారంభించనున్నారు. రామగుండం రీజియన్–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎండీ ఎన్.బలరామ్ శనివారం సింగరేణి భవన్ నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు. దానిలో భాగంగా ఎడ్యుకేషన్ జీఎం నికోలస్ రామగుండం మండల విద్యాధికారితో కలిసి పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని తరగతి గదులు, పరిసరాలను, కంప్యూటర్ గదులను పరిశీలించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సింగరేణి పాఠశాలలో మొట్టమొదటిసారిగా సీబీఎస్ఈలో విద్యాబోధన ప్రవేశపెట్టడంపై కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

రెండేళ్లు 1 నుంచి 8 తరగతులకు అమలు..

సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో చదువుతున్న 9, 10వ తరగతులు మినహా ఈ రెండేళ్లు 1 నుంచి 8వ తరగతి వరకు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తర్వాత అన్ని తరగుతులకు వర్తింపజేయనున్నారు. ఈ రెండేళ్లు 2024–25, 2025–26 విద్యా సంవత్సరాలకు 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు స్టేట్ సెలబస్‌లోని 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సిలబస్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తారా!

ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు సీబీఎస్ఈ సిలబస్‌పై అవగాహన తరగతులు నిర్వహించి వారితో విద్యాబోధన చేయిస్తారా, లేదా కొత్తవారికి అవకాశం ఇచ్చి కొత్త రిక్రూట్‌మెంట్ చేస్తారా అనే విషయంపై ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. సీబీఎస్ఈలో విద్యాబోధన చేయాలంటే కొన్ని సబ్జెక్టుల్లో మార్పులు ఉంటాయి. వాటికి అనుగుణంగా ఉండేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి బోధన చేసేలా చర్యలు చేపడతారా అనే విషయంపై వేచి చూడాల్సిందే.

త్వరలోనే విద్యాబోధన ప్రారంభం



ఆర్జీ–2ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో తొలిసారి సీబీఎస్ఈ సెలబస్‌లో విద్యా బోధనను త్వరలోనే ప్రారంభిస్తాం. ఇప్పటి వరకు దానిపై అధికారికంగా అనుమతి రాలేదు, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం స్టేట్ సెలబస్‌లో విద్యాబోధన జరుగుతుంది, ఉత్తర్వులు వచ్చిన వెంటనే సీబీఎస్ఈ సెలబస్‌లో విద్యాబోధన చేయనున్నట్లు తెలిపారు. సీబీఎస్ఈకి సంబంధించిన బుక్స్, స్టడీ మెటీరియల్ పాఠశాలకు రావాల్సి ఉంది.

– ఎస్.సుందర్‌రావు, హెచ్ఎం, సింగరేణి పాఠశాల

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర పరిధిలో ఉన్న బొగ్గు గనులను బేషరతుగా సింగరేణి సంస్థకే కేటాయించాలని ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, డిమాండ్ చేశారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ నుంచి కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రిగా ప్రమాణం చేసిన కిషన్‌రెడ్డి బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐఎన్‌టీయూసీ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. కార్మికుల సొంతింటి కలను నేరవేర్చడానికి, కొత్త బొగ్గు గనుల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. సింగరేణిలో కార్మికుల పిల్లలకోసం సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ విద్యా విధానం అమలుకు కృషి చేశామన్నారు. అన్ని సంఘాలు కలిసి వస్తే వారితో కలిసి బొగ్గుగనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు ధర్మపురి, ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ కోత్త సత్యనా రాయణ రెడ్డి, అక్రం, దశరథం గౌడ్, సంపత్ రెడ్డి, రాజయ్య, కొంగర రవీందర్, మార్కండేయ, లింగమూర్తి, ప్యారేమియా, అవినాష్, రవీందర్ పాల్గొన్నారు.

బల్దియాలో కాలపరిమితి దాటిన వాహనాల గుర్తింపు



పరిశీలిస్తున్న అధికారులు

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కాలపరిమితి దాటిన 15 పాత వాహనాలను మంగళవారం రామగుండం వెహికల్ ఇన్‌స్పెక్టర్ భీమ్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ గుర్తించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు కాలపరిమితి దాటిన వాహనాలను స్క్రాప్ కింద అమ్మడానికి వాహనాలను పరిశీలించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఇందులో 13 త్రీ వీలర్ గూడ్స్ ట్రాలీ ఆటోలు, ఒక పాత జీపు, ఒక లిఫ్ట్ వాహనాన్ని గుర్తించినట్లు వివరించారు. వాటి కాలపరిమితి ముగిసిందని, అవి రోడ్డుపై తిరిగే పరిస్థితి లేకపోవడంతో వాటిని స్క్రాప్ కింద వేలంలో అమ్మి వేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు వెహికల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వాట్సాప్‌లో వచ్చే లింక్స్ ఓపెన్ చేయొద్దు



మాట్లాడుతున్న సీఐ అజయ్‌బాబు

రామగుండం: అపరిచిత వ్యక్తులతో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, అపరిచిత ఫోన్‌కాల్స్, వాట్సాప్‌లో వచ్చే లింక్స్ ఓపెన్ చేయొద్దని, ఎవరికీ ఓటీపీలు చెప్పొద్దని రామగుండం సీఐ గొర్ల అజయ్‌బాబు కోరారు. మంగళవారం రాత్రి ఎల్లంపల్లిలో పోలీసుల కళాబృందం ప్రదర్శన ఏర్పాటు చేశారు. సీఐ మాట్లడుతూ అపరిచిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, యువతులు, మహిళలు షీ టీం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కాగా ఆట, పాట రూపంలో నిర్వహించిన కళాప్రదర్శనకు ఎల్లంపల్లి గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అంతర్గాం ఎస్సై బోయ వెంకట్, కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం



మొక్క నాటుతున్న కందుల సంధ్యారాణి

గోదావరిఖనిటౌన్: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి, జయంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక కృష్ణవేణి పాఠశాలలో బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. బీజేపీ నాయకులు సుల్వ లక్ష్మీనర్సయ్య, అపర్ణ, అందె రాజ్‌కుమార్, మేరుగు శ్రీనివాస్, మురళి, అజయ్‌కుమార్, స్వామి, ఉష, లక్ష్మి, నందన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు యజమానిపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మంథని: మున్సిపల్ పరిధిలోని గంగాపురి రైస్‌మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు బాధితుడు గొర్రె రమేశ్‌తో కలిసి మంగళవారం ఆర్డీవో హనుమానాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్ మాట్లాడుతూ అక్రమంగా బోరు వేసి నీటి చౌర్యానికి పాల్పడుతున్నారని, అక్రమంగా విద్యుత్ వినియోగంతో మూడు మూగజీవాలు మృత్యువాత పడ్డాయన్నారు. వారం గడుస్తున్నా తెగిన కరెంట్ తీగలు మార్చకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. బోయిన్‌పేటకు నిత్యం కాలినడకన అనేక మంది వెళ్తుంటారని, ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. సదరు యజమానిపై చర్యలు తీసుకోవాలని, బోర్ సీజ్ చేయాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాగర్, నాయకులు వేల్పుల సురేశ్, బావు రవి, కన్నెబోయిన కిష్టస్వామి ఉన్నారు.

పూడికతీత పనులు వేగవంతం చేయాలి



డివిజన్లలో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: నాలాలపై పెరిగిన చెట్లను తొలగించాలని, కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 42వ, 46వ డివిజన్ల పరిధిలో మంగళవారం కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు పాతిపెల్లి ఎల్లయ్యతో కలిసి ఆయన పర్యటించారు. డివిజన్లలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, సూపర్‌వైజర్ యూసుఫ్ పాల్గొన్నారు.

రామగుండం రైల్వేస్టేషన్‌ను సందర్శించండి



వినతిపత్రం అందిస్తున్న అనుమాస శ్రీనివాస్

రామగుండం: అమృత్ భారత్ నిధులతో ఆధునీకరణ పనులు నత్తనడకన కొనసాగుతున్న రామగుండం రైల్వేస్టేషన్‌ను సందర్శించాలని రైల్వే ప్రజా సంబంధాల మాజీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ కోరారు. మంగళవారం పెద్దపల్లి ఎంపీగా ఢిల్లీ పార్లమెంట్ భవన్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించిన గడ్డం వంశీకృష్ణ ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామగుండం రైల్వేస్టేషన్‌లో నవజీవన్, మిలీనియం, గరీబ్‌రథ్, హిసార్, స్వర్ణజయంతి తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీ త్వరలోనే రామగుండం రైల్వేస్టేషన్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించి స్థానిక పరిస్థితులు తెలుసుకొని రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అక్రమంగా నిల్వ ఉంచిన పాఠ్యపుస్తకాలను సీజ్ చేయాలంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ల సందీప్, జిల్లెల ప్రశాంత్ డిమాండ్ చేశారు. పాఠశాలలో పాఠ్యపుస్తకాలు ఉన్న గది ముందు మంగళవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎలాంటి అనుమతి లేకున్నా పుస్తకాలపై విద్యాసంస్థ పేరును ముద్రించి అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డీఈవో, ఎంఈవోలకు ఫిర్యాదు చేసినా తమకు సంబంధం లేదంటూ తప్పించుకున్నారని తెలిపారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి గుర్తింపు రద్దు చేయాలని కోరారు. నాయకులు సిద్ధార్థ, నవీన్, రోషన్, నితిన్, ధరణ్, రాజు ఉన్నారు.

జీడీకే–11గనిపై ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న జీఎం, ఇతర అధికారులు

గోదావరిఖని: గని కార్మికుల సంక్షేమం కోరుతూ సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–11గనిపై మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీగణపతి, నవగ్రహ, హనుమాన్ పూజ, మృత్యుంజయ రుద్రహోమం శాస్త్రోక్తంగా జరిపారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పూజల్లో పాల్గొన్నారు. ఏరియా అధికారులు, సైదులు, చంద్రశేఖర్, కిరణ్‌రాజ్, చిలుక శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ధనలక్ష్మీబాయి, గని మేనేజర్ నెహ్రూ పాల్గొన్నారు.

వానాకాలంలో జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలే అవకాశాలుంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండి, జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి సూచించారు. పెద్దపల్లిలో మంగళవారం కమిషనర్ వెంకటేశ్‌తో కలిసి మున్సిపల్, మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ డబ్బాల్లో, వ్యర్థసామగ్రిలో నిల్వ ఉండే నీటితో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమల నివారణకు రోజూ రెండు వార్డుల్లో ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాల్ సెంటర్ నంబర్ 6303127484కు ఫిర్యాదు చేస్తే మున్సిపల్ సిబ్బంది పరిష్కరిస్తారన్నారు. మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్, విద్యుత్ ఏఈ రవీందర్ పాల్గొన్నారు.

26న పెన్షన్ అదాలత్

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల సింగరేణి మాజీ ఉద్యోగులకు సంబంధించి కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ అదాలత్‌ను సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ సమక్షంలో 26న నిర్వహించనున్నట్లు ఆర్జీ–3 ఏరియా పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, పనిచేసి వివిధ కారణాలతో ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు, పీఎఫ్, పెన్షన్ సంబంధిత సమస్యలు ఉన్న వారు పెన్షన్ అదాలత్‌కు హాజరై, వారి సమస్యలను సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తే పరిష్కారమవుతాయన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

ముత్తారం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై ముత్తారం మండలంలోని పారుపల్లిలో గోదావరిఖని ఏసీపీ రమేశ్ విచారణ చేపట్టారు. ఆయన వివరాల ప్రకారం.. పారుపల్లిలో గతంలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణం కోసం ఐదు గుంటల భూమిని గ్రామానికి చెందిన గొట్టిముక్కల సంపత్‌రావు గీత కార్మిక సంఘానికి విరాళంగా ఇచ్చాడు. కానీ, ఈ నెల 21న ఆలయ నిర్మాణ పనుల కోసం ఆ స్థలాన్ని చదును చేస్తూ నీరు పడుతున్న ఇనుముల లక్ష్మయ్యను కులం పేరుతో, అసభ్య పదజాలంతో దూషించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంపత్‌రావుపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఏసీపీ రమేశ్ మంగళవారం గ్రామానికి చేరుకొని, విచారణ జరిపారు. మంథని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మధుసూదన్‌రావు ఉన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

ఎలిగేడు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి నిస్సీ క్రిస్టీనా సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

దుద్దిళ్ల సోదరులపై చేసిన వ్యాఖ్యలు సరికాదు

రామగిరి: పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు చేసిన వ్యాఖ్యలు సరికావని యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ అన్నారు. సెంటనరీకాలనీ శ్రీపాద భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నడుస్తున్న ఇసుక క్వారీలకు అనుమతి ఇచ్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేని తెలుసుకోవాలని పుట్ట మధుకు హితవు పలికారు. అభివృద్ధిపై కాంగ్రెస్ పక్షాన బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. నాయకులు బోగె ప్రకాశ్, గొట్టిముక్కల మల్లేశ్, చక్రి, గుడిసెల సంతోష్, ఆరెల్లి మహేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లికి మొక్కులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఎల్లమ్మతల్లి ఆలయంలో మంగళవారం గౌడసంఘం ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించారు. ఎల్లమ్మబోనాలు జరుపుకున్న గీతకార్మిక కుటుంబాలు మంగళవారం బోనంతో నైవేద్యం సమర్పించారు.

కేజీబీవీ ఆకస్మిక సందర్శన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి కేజీబీవీని మంగళవారం ఎంపీడీవో ఎంఏ.అలీం ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. బ్రాహ్మణపల్లి లంబాడి తండాలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. పనులు పూర్తి చేయాలని అంతర్గాం మండల విద్యుత్‌శాఖ ఏఈ శంకర్‌తో చర్చిస్తానన్నారు. వాష్‌రూమ్స్‌లో పెండింగ్‌లో ఉన్న టైల్స్ పనులు శనివారంలోగా పూర్తి చేయాలని పాఠశాల కమిటీ చైర్మన్‌ను ఆదేశించారు.

శ్మశానవాటికను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఓదెల: మండలంలోని గుంపుల గ్రామంలో ఇటీవల శ్మశానవాటికను కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు తాళ్లపల్లి వెంకటేశ్ గౌడ్ మంగళవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. నిందితులను గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కౌశిక హరిని సన్మానించిన కేసీఆర్



సన్మానిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

గోదావరిఖని: ఇటీవల జరిగిన రామగుండం కేశోరాం సిమెంట్స్ ఫ్యాక్టరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్యానల్ విజయం సాధించింది. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌ను కౌశిక హరి మంగళవారం ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌లో కలిశారు. కేసీఆర్ ఆయనను సన్మానించి అభినందించారు. ఆయన వెంట సతీమణి కౌశిక లత, కొడుకు కౌశిక భరత్ ఉన్నారు.

వీధిదీపాల సమస్య పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సతీశ్‌కుమార్

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని రామగుండం రైల్వేస్టేషన్ నుంచి రాజీవ్ రహదారి బైపాస్ రోడ్డు వరకు వీధిదీపాలు వెలగకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంగళవారం కార్పొరేటర్ కన్నూరి సతీశ్ కుమార్ నగర కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్‌లో భాగంగా రూ.26 కోట్ల నిధులతో ఆధునీకరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో స్టేషన్ ఎదుట సెంట్రల్ లైటింగ్‌ను మరింత వెలుగులతో అందంగా తీర్చిదిద్దాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ సూచించారు. సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్లో ప్రజలు చికెన్‌గున్యా, డెంగీ జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

8వ సారి రక్తదానం



కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో సివిల్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్న విశ్వతేజ మంగళవారం స్వచ్ఛందంగా ప్రాణాపాయంలో ఉన్న ఓ పేషెంట్‌కు రక్తదానం చేశారు. జీజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్‌కు అత్యవసరంగా రక్తం అవసరం కాగా, విషయం తెలిసిన విశ్వతేజ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చాడు. 8వసారి రక్తదానం చేసిన విశ్వతేజను ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్, టెక్నీషియన్లు సంపత్, స్వప్న, నర్సింగ్ ఆఫీసర్ లావణ్య అభినందించారు.

విధులు బహిష్కరణ

గోదావరిఖని: సింగరేణిలోని ఐటీ విభాగంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న సర్వీస్ ఇంజినీర్లు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. పనికి తగిన వేతనం అందక ఇబ్బందులు పడుతుమని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించేందుకు కాంట్రాక్టు సంస్థ, సింగరేణి యాజమాన్యం చొరవచూపక పోవడంతో విధులు బహిష్కరించి సమ్మెకు దిగాల్సి వచ్చిందని వివరించారు. సింగరేణిలో ఉత్పత్తి చేసిన బొగ్గును రవాణా చేయడంలో ఐటీ విభాగం పాత్ర కీలకంగా మారింది. సమ్మెతో బొగ్గు రవాణాకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి యాజమాన్యం చొరవ చూపి వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

రైతు భరోసాపై ముఖాముఖి

కమాన్‌పూర్: రైతు భరోసా పథకం మార్గదర్శకాలు, అమలు తీరుపై మంగళవారం ముఖాముఖి సమావేశం నిర్వహించారు. మండలంలోని గుండారం రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, అగ్రికల్చర్ డైరెక్టర్, అగ్రికల్చర్ ప్రిన్సిపాల్ సెక్రటరీలు నేరుగా రైతులతో మాట్లాడారు. సహాయ వ్యవసాయ సంచాలకులు జె.కాంతారావు, మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్, మంథని వ్యవసాయాధికారి భూక్య మోహన్, ముత్తారం వ్యవసాయాధికారి శ్రీకాంత్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గోదావరిఖని: ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. స్థానిక గాంధీనగర్‌కు చెందిన బైరి సతీశ్(32) తన భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురయ్యాడు. 4రోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడు మృతి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం కొత్తగేట్‌లో బైక్‌పై ప్రయాణిస్తున్న భవన నిర్మాణ కార్మికుడు టి.సారయ్య(48) ఛాతి నొప్పి రావడంతో రోడ్డుపైనే కుప్పకూలి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సారయ్య సెంట్రింగ్ ఆటోట్రాలీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం కమాన్‌పూర్ మండలం ఆర్అండ్ఆర్ పెద్దంపేట కాలనీలో పనిచేసే క్రమంలో ఛాతినొప్పి రావడంతో మేస్త్రీ బైకుపై రమేశ్‌నగర్‌లోని ఇంటికి తీసుకెళ్లే క్రమంలో మార్గమధ్యలో నొప్పి ఎక్కువ కావడంతో రోడ్డుపైనే కుప్పకూలి మృతి చెందాడని పేర్కొన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లిరూరల్: మండలంలోని చీకురాయి గ్రామానికి చెందిన ఏగోలపు కొమురయ్యగౌడ్ మంగళవారం తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడడంతో గాయాలపాలయ్యాడు. స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఆరోపణలు విడ్డూరం

మంథని: కాంగ్రెస్ నాయకులపై జెడ్పీచైర్మన్ పుట్ట మధు చేస్తున్న ఆరోపణలు విడ్డూరమని, బీఆర్ఎస్ పాలనలోనే అవినీతి జరిగిందని కాంగ్రెస్ నాయకుడు భూపెల్లి రాజు అన్నారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుద్దిళ్ల కుటుంబం పేర్లు తీయనిదే పుట్ట మధుకు పూట గడవదని ఎద్దేవా చేశారు. నాయకులు మంథని సత్యం, అక్కపాక సంపత్, ఆర్ల నారాయణ, బాపు, అశోక్ ఉన్నారు.

ఎంపిక పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కాల్వశ్రీరాంపూర్: క్రీడా పాఠశాలల్లో విద్యాభ్యాసం కోసం నాలుగో తరగతిలో ప్రవేశానికి కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన పోటీల్లో ఏడుగురు విద్యార్థులు ప్రతిభ చూపి ఎంపికైనట్లు ఎంఈవో సురేందర్‌కుమార్ తెలిపారు.

ఫొటోగ్రాఫర్‌కు ఆర్థిక చేయూత

గోదావరిఖనిటౌన్: ఇటీవల యాక్సిడెంట్‌కు గురై తీవ్రంగా గాయపడిన స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ వేల్పుల ప్రదీప్‌కుమార్‌కు రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తెలంగాణ కుటుంబ భరోసా నుంచి రూ.10వేల చెక్కును పంపించారు. కాగా స్థానిక అసోసియేషన్ నాయకులు ప్రదీప్ నివాసంలో మంగళవారం అందజేశారు.

సంకష్టహర చతుర్థి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పలు దేవాలయాల్లో సంకష్టహర చతుర్థి వేడుకలు జరుపుకున్నారు.

సింగరేణి సివిల్ కాంట్రాక్టర్లపై సీపీకి ఫిర్యాదు

గోదావరిఖని: తమ పనుల వద్దకు వచ్చి బెదిరించిన కాంట్రాక్టర్లపై తోటి కాంట్రాక్టర్ రామగుండం పోలీస్ కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. సివిల్ కాంట్రాక్టర్లు తమమాట వినకుండా టెండర్‌లో పాల్గొన్నాడనే అక్కసుతో పనులను అడ్డుకున్నారని బాధితుడు బుక్యా రాజు ఆరోపించారు. అంతేకాదు.. సూపర్‌వైజర్, కూలీలపై దాడి చేశారని, కులం పేరుతో దూషించారని, ఆర్జీ–1 జీఎం, చీఫ్‌విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశామన్నారు.